**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**
**తేది: 15 డిసెంబర్, 2020.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. – **జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : కరోనా కాలంలో ప్రైవేటు బడ్జెట్ స్కూళ్ళలో ఉపాధి కోల్పోయిన వారికి ప్రత్యేక స్కీం ప్రకటించి ఆదుకోవాలని కోరుతూ...**

**ఆర్యా!**

కరోనా వ్యాధి ఆవరించడం, లాక్‌డౌన్ ప్రకటించడం లాంటి పరిణామాల వల్ల అనేక మంది ఉపాధి కోల్పోయారు. వారిలో ప్రైవేటు విద్యాసంస్థల్లో పని చేసే టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సంఖ్య గణనీయంగా ఉంది. ఆర్థికంగా వెసులుబాటు కలిగి ఉన్నా, కార్పొరేట్ యాజమాన్యాలు ఉపాధి కోల్పోయిన వీరిని ఆదుకోలేదు. ఉన్న ఉపాధి పోవడం, ప్రత్యామ్నాయ పనులు దొరక్క తీవ్ర ఆర్థిక ఒత్తిడిలోకి జారిపోయారు. కొందరు ఆత్మహత్యలకు కూడా ఒడిగట్టారు. ఇటీవల కాలంలో మన రాష్ట్రంలో బడ్జెట్ స్కూల్స్ ఒక పెద్ద సెగ్మెంట్‌గా ఆవిర్భవించాయి. కార్పొరేట్ స్కూళ్లను మినహాయిస్తే, బడ్జెట్ స్కూళ్ళలో తక్కువ ఫీజులతో చదువుకుంటున్నారు. ఈ స్కూళ్ళకు విద్యార్థులను పంపే తల్లిదండ్రులు తక్కువ ఆదాయాలవారే. ఈ సంస్థల్లో పనిచేసేవారు కూడా చాలా తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారు. ఉద్యోగం లేదు కాబట్టి స్కూళ్లు ప్రారంభించి స్వయం ఉపాధి పొందే ఈ తరగతిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్న కోర్కె సమంజసమైనది. వీరికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక స్కీము ప్రకటించి ఆదుకోవాలని కోరుతున్నాం.

మన రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు 40 వేలు ఉండగా 41 లక్షల మంది అందులో చదువుకుంటున్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలలు 15 వేలు ఉండగా 36 లక్షల మంది చదువుకుంటున్నారు. దేశ అక్షరాస్యత 74% కాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యత 64 శాతంగాను, విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యత 61 శాతంగానూ ఉంది. కార్పొరేట్ స్కూళ్లలో సుమారు 4,5 లక్షల మంది చదువుకుంటుంటే మిగతా విద్యార్థులంతా ప్రైవేటు బడ్జెట్ స్కూళ్లలోనే చదువుకుంటున్నారు. ఈ బడ్జెట్ స్కూళ్ళలో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సుమారు 3 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. కార్పొరేట్ యాజమాన్యాలు ఆర్థికంగా అవకాశం ఉండి కూడా ఆ సంస్థల్లో పని చేసే సిబ్బందిని ఆదుకోలేదు.

కార్పొరేట్ స్కూళ్ళు, కాలేజీల యాజమాన్యాలు టీచర్లు, సిబ్బందికి నెలవారీ వేతనాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. యూనివర్సిటీలు, కాలేజీలు, ఇతర ప్రైవేటు విద్యాసంస్థల వారే కాక ప్రభుత్వ విద్యాసంస్థల్లో పని చేసే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వారు కూడా ఈ కాలంలో వీధిన పడ్డారు. లక్షల సంఖ్యల్లో ఉన్న వీరు ఉన్న పని పోయి, కొత్త పని దొరక్క, దొరికిన పని చేయలేక తీవ్ర నిరాశను ఎదుర్కొంటున్నారు. వీరికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లించాలి.

"త్రిప్పి చూడగలరు"

విద్య ఒక ప్రాథమిక హక్కు. విద్యాహక్కు చట్ట ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల వయసు వరకు ఉన్న వారందరూ విద్యా వ్యవస్థలోకి సమీకరించబడాలి. కానీ 74 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం కూడా ఈ విద్యావ్యవస్థలో వీరిని ఇముడ్చుకోవడం లేదు. కారణం ప్రభుత్వ విధానాలే. ప్రభుత్వం పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎప్పటికప్పుడు స్కూల్సు కొత్తవి పెట్టి ఉంటే ఈ ప్రైవేటు స్కూళ్లు ఈ రీతిగా ఆవిర్భవించేవి కాదు. స్కూళ్ళలో సరిపడినంత మంది టీచర్లు ఉన్నా ఇంత విస్తారంగా ప్రైవేటు స్కూళ్ళు వెలిసేవి కావు. గత 20, 30 సంవత్సరాల నుండి ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ ఆపివేయబడింది. ఈ రోజుకి కూడా రాష్ట్రంలో 23 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఉపాధి పోయిన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక స్కీము ప్రకటించి నెలకు రు.10 వేలు చొప్పున కనీసం 6 నెలలపాటు ఇచ్చి విద్యారంగంలో స్కూళ్ళ నిర్వహణ సాఫీగా జరగడానికి వీలుగా చర్యలు చేపట్టాలి.

అభివందనములతో...

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి